

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన **సేవా రత్న, విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.**



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

19, 20, 21, 22 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి **(సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్టేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 20 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.




ఎల్‌వైఆర్ గార్డెన్ గేటుకు తాళం వేస్తున్న మునిసిపల్ సిబ్బంది

సకాలంలో పన్నులు చెల్లించాలి

- లేదంటే ఆస్తుల జప్తు
- మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, మార్చి18 : మునిసిపాలిటీ పరిధిలో ఉన్న బకాయిదారులు ఇంటి పన్నులు, టాక్స్‌లు, ఇతర పన్నులను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. సోమవారం మునిసిపల్ సిబ్బంది తొర్రూరుపట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటి పన్నుల వసూళ్లు చేపట్టారు. ఇండ్లముందుకు వెళ్లి డప్పులు కొడుతూ పన్నులు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పన్నులకు రాయితీ ప్రకటించిందని 2023-24 సంవత్సరానికి భారీగా బకాయిలు పేరుకుపోయాయని, ఆస్తి పన్నుదారులకు 1, 2 నోటీసులు ఇచ్చి, 3వ నోటీసుకు ఆస్తులు జప్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.పట్టణంలోని ఎల్‌వైఆర్ గార్డెన్ నిర్వాహకులు పన్ను చెల్లించకపోవడంతో గేటుకు తాళం వేశారు. పన్నులు వెంటనే సూచించారు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది కట్ట స్వామి, రాజు, దేవేందర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, శంకర్, యాకయ్య, మురళి ఉన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్‌పై అయోమయం!

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య

జీడబ్ల్యూఎంసీ	21,623
జనగామ	6,300
మహబూబాబాద్	7,546
తొర్రూరు	3,200
డోర్నకల్	3,600
మరిపెడ	4,234
పరకాల	5,200
నర్సంపేట	5,462
వర్ధన్నపేట	1,200
భూపాలపల్లి	7,234

- ఈనెలాఖరులోపు పరిష్కారం సాధ్యమేనా?
- ఓ వైపు సిబ్బంది కొరత.. మరో వైపు ఎన్నికల హడావిడి
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 65వేలకుపైగా దరఖాస్తులు
- ఇప్పటికే రెండేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపు

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థలాల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం తెరపైకి లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)లో వచ్చిన దరఖాస్తులన్నిటిని ఈనెల 31 లోపు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమైనా.. మున్సిపల్ అధికారులు మాత్రం అయోమయంలో పడ్డారు. ఓ వైపు శాఖల్లో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా.. ఈ లోపే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధం వారి నుంచి వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియలో నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది, మునిసిపల్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు చైన్‌మెన్లు ఎంతో కీలకం. అయితే వరంగల్ మహానగర పాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట మున్సిపాలిటీల్లో మాత్రమే కొంత మేరకు ఈ సిబ్బంది ఉన్నా.. వీరికి ఇతర మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాంటే అయిదారు నెలలు పడుతుందని అంచనా కాగా.. ప్రస్తుతం తగిన సంఖ్యలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చిన నేపథ్యంలో చాలామంది అధికారులు, సిబ్బంది ఆ విధుల్లో బిజీగా మారడంతో ఈనెలాఖరు లోపు క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలపై మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ అమలులో ఎట్టకేలకు కదలిక వచ్చినా పలు కారణా లతో ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితులు కనిపిం చడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలో 65వేలకుపైగా దరఖాస్తులు పరిష్కారానికి ఎదురుచూస్తున్నాయి.

పథకం అమల్లో కదలిక..

2020లో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల భూ క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండడంతో ఇక్కడి స్థలాల ధరలు భారీగా పెరిగాయి. పట్టణ శివార్లలో జోరుగా వెంచర్లు వెలియడంతో కొనుగోలుదారులు వాటిలో ప్లాట్లు తీసుకున్నారు. చాలా వెంచర్లకు అనుమతి లేపోవడంతో పురపాలక సంఘాల అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకురాగా తాజాగా ఈ పథకం అమలులో కదలిక వచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల్లో మొత్తం 65,599 దరఖాస్తులు రాగా.. అప్పట్లోనే వీటి ద్వారా మునిసిపాలిటీలకు రూ.65.59కోట్ల ఆదాయం వచ్చింది. ఇక దరఖాస్తు సమయంలో ఒక్కో ప్లాట్‌కు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చెల్లించారు. వివిధ కారణాలతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. గత నెల 22న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దాంతో పురపాలికలకు ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడగా.. గత నెల 26న ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసింది. దేవాదాయ, వక్ఫ్ బోర్డు, ప్రభుత్వ, కోర్టు పరిధిలో ఉన్న భూములను మినహాయించి ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది

పరిశీలనతో మరింత ఆదాయం..

వరంగల్ నగర పాలక సంస్థతో పాటు జనగామ, మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మున్సిపాలిటీల్లో నేరుగా ఈ దరఖాస్తులను పరిశీలించవచ్చు. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే పురపాలికకు ప్రాంతాన్ని బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో స్థలానికి ఉన్న డిమాండ్‌ను బట్టి ఈ విలువ ఇంకా పెరిగి మునిసిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరుతుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. చాలా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణతో రూ. వందల కోట్లలో ఆదాయం సమకూరనుంది. పట్టణాల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనల మేరకు 10 శాతం స్థలాన్ని ప్రజోపయోగం కోసం పురపాలికలకు అప్పగించాలి. ఇది చాలా చోట్ల అమలు కాలేదు. దీనికి తోడు నిర్దేశించి వెడల్పు న రోడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో వెంచర్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

మార్గదర్శకాలు లేక...

సెల్‌ఫోన్ యాప్, పురపాలక శాఖ వెబ్ సైట్ (ఎల్‌ఆర్‌ఎస్-2020) ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఎలా పరిశీలించాలి ? ఎన్ని విడతల్లో ప్రక్రియ చేపట్టాలనే అంశంపై యంత్రాంగంలో స్పష్టత లేక ఇంతకాలం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అడపాదడపా ఈ అంశంపై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగా లేక పోవడంతో మునిసిపాలిటీల్లో ఇంత కాలం ముందుకు సాగలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కసరత్తు ముమ్మరం చేశారు.



మానుకోట పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రశాంతంగా ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం

- జిల్లాలో 8,207 మంది విద్యార్థులకు 8,186 హాజరు
- మానుకోట పట్టణంలో కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 49 ఎగ్జామ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.విద్యార్థులు 8.30 గంటలకు ఆయా సెంటర్లకు చేరుకున్నారు. ఉదయం పరీక్ష సమయానికంటే ముందుగానే డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌ల నుంచి పోలీసు బందోబస్తు నడుమ పరీక్ష పత్రాలను తీసుకువచ్చారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు.



కేసముద్రం స్టేషన్ హైస్కూల్ సెంటర్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తొలిరోజు తెలుగు పేపర్‌కు రెగ్యులర్ విద్యార్థులు 8192 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8173 మంది హాజరయ్యారని జిల్లావిద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. ప్రైవేటు (కంపార్ట్‌మెంట్) విద్యార్థులు 15 మందికి 13 పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తాగునీరు, తరగతి గదుల్లో బేంచీలు, వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యం అందించేందుకు మెడికల్ కిట్లతో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సందర్శించారు. సెంటర్‌లో విద్యార్థులకు కల్పించిన వసతులు, సౌకర్యాలను చీఫ్‌సూపరిండెంట్‌లను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రామారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఉన్నారు. కాగా, పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌టీంలు జిల్లా వ్యాప్తంగా పలుసెంటర్లను సందర్శించినట్లు, తొలిరోజు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రామారావు తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సెయింట్‌పాల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించేందుకు లోనికి వెళ్లిన డీఎస్పీ సురేష్ బయట ఉన్న పోలీస్‌సిబ్బంది వద్ద సెల్‌ఫోన్ ఉంచి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పరీక్ష కేంద్రాలను ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న సీఐ, ఎస్సైలు పరీక్ష ముగిసే వరకు పర్యవేక్షించారు.

Nagarjuna కావలెను
వరంగల్, హన్మకొండ, నర్సంపేట, జనగాం, మహబూబాబాద్, తొర్రూర్, పాలకుర్తి, మడికొండ, పరకాల, భూపాలపల్లి, ములుగు, మహదేవ్‌పూర్ మరియు ఇతర ప్రాంతాలలో నాగార్జున పాలు మరియు పాల పదార్థములు అమ్మకాలు చేయుటకు పార్లర్ ఏజెంట్లు కావలెను.
సంప్ర: 8142823366, 8142613366, 7337441572

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.32 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.59 గం..

సోమవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 33.0°C
	కనిష్ఠం : 22.0°C

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి


- డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కళావతిబాయి

నెహ్రూసెంటర్, మార్చి18 : జిల్లాలో గర్భిణుల వివరాలను 12 వారాల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు మాతా శిశుసంరక్షణ కోసం పాటుపడాలని సూచించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సిజేరియన్ ఆపరేషన్‌లు తగ్గించాలని సూచించారు. వందశాతం వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలని, అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధుల నిర్ధారణను 30 ఏళ్లు పైబడిన వారందరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో చేపడుతున్న వ్యాధిగ్రస్తుల సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. రెండు వారాలకు పైగా దగ్గుతో బాధపడుతున్న వ్యక్తులకు తెమడ పరీక్షలు చేయాలన్నారు. రానున్న వేసవికాలంలో ఓఆర్‌ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్యకార్యక్రమాల అమలులో మహబూబాబాద్ జిల్లాలను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని వైద్యాధికారులను అధికారులను ఆదేశించారు. వైద్యాధికారులు మురళీధర్, అంబరీష, బిందు, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రవన్‌కుమార్, ప్రసాద్, మంగమ్మ పాల్గొన్నారు.

వామ్మో.. ఇన్ని రోజులా!



- ముందే మూడు పార్టీల అభ్యర్థుల ప్రకటన
- జంప్ జిలానీల ఝలక్‌తో నేతల జేబులకు చిల్లులు
- క్షేత్రస్థాయి క్యాడర్‌ను కాపాడుకోవడంపై మల్లగుల్లాలు

అప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు 30, ఇప్పుడు 57 రోజులు

మహబూబాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఓడిన వారు.. అక్కడే ఏడిస్తే.. గెలిచిన వారు ఇంటికెళ్లి ఏడ్చిన చందాన.. రేపటి పార్లమెంట్ ఎన్నికల ఖర్చులు ఊహించుకోవడానికే అభ్యర్థులను కలవరపెడుతున్నాయి. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటన నుంచి పోలింగ్ నాటికి తేడా రెండింతలు పెరిగింది. దీంతో అభ్యర్థుల గుండెలు లబ్బు.. డబ్బు.. అని కాకుండా డబ్బు..డబ్బు అంటూ కొట్టుకుంటున్నాయి. 2019 మార్చి 10న లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడితే 18 మార్చికి నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి. అంటే షెడ్యూల్ నుంచి ఎన్నికల నాటికి 30 రోజులే వ్యవధి కావడంతో ఎన్నికల ఖర్చులు కొంత వరకు అభ్యర్థులకు కలిసి వచ్చినట్లే అయింది. ఈ సారి 2024 ఎన్నికల కోసం మార్చి 16న షెడ్యూల్ వెలువడగా, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. మే 13న ఎన్నికలు జరుగనున్నాయి. అంటే ఈ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల నుంచి మొదలుకుని ఎన్నికల నాటికి 57 రోజుల వ్యవధి అన్నమాట. అంటే గత ఎన్నికలతో పోలిస్తే రెండింతలు పెరిగిన కాలవ్యవధి కనుగుణంగా ఎన్నికల ఆర్థికభారం కూడా పెరుగుతుందని చెప్పడం నిర్వివాదాంశం..!

జంప్ జిలానీల ఝలక్‌లతో..

ఎన్నికలనగానే జంప్ జిలానీల పాత్ర ప్రధానంగా తెరపైకి వస్తూ ఉంటుంది. అవి సర్పంచ్ ఎన్నికలు కానీ.. ఎమ్మెల్యే ఎన్నికలు కానీ... ఆపై ఎంపీ ఎన్నికలు కానీ.. 'కాదేది కాసులు కురిపించడానికనర్హం' అన్నట్లు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రతీ ఎన్నికలకు ముందు కాస్తోకూస్తో పేరుగడించిన చోటమోటా నాయకులు మొదలుకుని ప్రథమ, ద్వితీయశ్రేణి నాయకుల వరకు జంప్ జిలానీలుగా మారుతుంటారు. కొందరికి డబ్బుల ఆశ ఉంటే.. మరికొందరికి అధికారం ఆశ, ఇంకొందరికి పేరు.. పెద్దరికం ఆశ ఇలా.. ఏదైతేనేం.. పార్టీలు మారడం నిత్యఎన్నికల తతంగమే. ఈ సారి కూడా 57 రోజుల సమయంలో ఎవరూ ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి ఎగిరిపోతారో.. తెలియని పరిస్థితి. అందులోనూ అతిపెద్దదైన పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఎక్కడో.. ఓచోట ఓ పార్టీకి మరోచోట మరో పార్టీకి ఇలా మండలాలు, పట్టణాలు గ్రామాల్లో పట్టున్న చోట ఈ నాయకులు ఇప్పటికే పార్టీ మారుతామని అభ్యర్థులకు ఝలక్ ఇస్తున్నారట..! వారి డిమాండ్‌లకు తలొగ్గుతూ వస్తే ఎన్నికలు జరిగే నాటికి ఆర్థిక భారం మోయడమేలా అన్న ప్రశ్నలు ప్రధాన పార్టీల అభ్యర్థులను నిద్రకు దూరం చేస్తున్నాయి. దీనికి తోడు తమపార్టీలో ఉన్న లీడర్లు.. క్యాడర్‌ను కాపాడుకోవడం తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం నుంచి రెండు ఎన్నికల్లో ఒకే పక్షం వైపు ఓటరు ఉంటే గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఒక్కసారిగా అధికార మార్పిడికి దారి తీశాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏ పార్టీ నుంచి ఎటు మారుతారో తెలియని అయోమయ రాజకీయాల్లో ఎవరిని నమ్మాలో...! ఎవరిని వదులుకోవాలో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

నాటికీ.. నేటికీ తేడా ఏంటంటే ?

గత పార్లమెంట్ ఎన్నికలు జరుగడానికి కొద్దిరోజుల ముందే అసెంబ్లీ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. అందులోనూ అధికారంలో బీఆర్‌ఎస్ పార్టీ హవా కొనసాగింది. ఆ క్రమంలో 30 రోజుల వ్యవధితోనే వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దగా ఆర్థికభారం అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలపైన కూడా పడలేదనే పరిశీలకుల అంచనా. ఈసారి మాత్రం ముందే ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ఖరారు అయి ఉండడం. ఆ ముగ్గురు కూడా త్రిముఖ పోటీలో నువ్వానేనా అన్నట్లు తలపడేందుకు సిద్ధపడడం వెరసి ఆర్థికభారం కూడా పోటాపోటీగా పెంచుకోవాల్సి వస్తుందని అభ్యర్థుల్లో ఆందోళన కనబడుతోంది. అలాగని ఎవరికి వారే 'తగ్గితే పోలా..?' అను కుంటే ముగ్గురిలో ఎవరో ఒకరు 'తగ్గేదే..లే..!' అని ఎంత ఖర్చుకైనా వెనుకాడకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలె త్తుతోంది. గత పార్లమెంట్ ఎన్నికలప్పుడు అప్పటి అధికార పార్టీ ఆఫ్ ద రికార్డులోనే ఓటరుకు రూ.వంద చొప్పున ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న అభ్యర్థి కొన్ని నియోజకవర్గాల్లో నామ్‌కే వాస్తేగా పంచి చేతు లెత్తేయడంతోనే అప్పట్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ప్రచారం జరిగింది. ఇక త్రిముఖ పోటీలోని అభ్యర్థి మాత్రం పార్టీ క్యాడర్ ఉన్నచోట పంచుకుని అంతా ఓటరుదే తీర్పు అని మౌనం దాల్చారట.

"Stress Free Education with Good Results"
SUVIDYAA JUNIOR COLLEGE FOR GIRLS
Nakkalagutta, Hanumakonda. Cell : 8885599155, 166
We are HIRING
IIT : ✦ Maths ✦ Physics ✦ Chemistry
NEET : ✦ Botany ✦ Zoology ✦ Physics ✦ Chemistry
Should have minimum 10 Years of Teaching Experience
PRINCIPAL (Female) : Must Possess 60% of Marks in any P.G. with min. 5 Years of Teaching Experience & Good Communication Skills in English.
JUNIOR LECTURERS : ★ Maths A & B ★ Physics ★ Chemistry ★ Botany ★ Zoology ★ English ★ Sanskrit
Must Possess P.G. with 55% of Marks in the concerned subject with min. 5 Years of Teaching Experience.
WARDENS : 4 (Female only), Qualification : Any Degree
DTP OPERATOR : Good at typing Maths, Pagemaker & Photoshop
Attractive Salary for deserved Candidates.
Interested Candidates can forward their resume to suvidyaajc@gmail.com
Interviews : Teaching 22 & 24-03-2024 ✦ Non-Teaching 23-03-2024
Time : 10 am to 5 pm

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY
ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి
ప్రతి మంగళ వారం & శుక్ర వారం
బ్లాక్ & వైట్ స్క్వేర్ సెం.మీ. Rs.170/-
కలర్ స్క్వేర్ సెం.మీ. Rs.220/-
సింగిల్ మరియు డబుల్ కాలమ్ మాత్రమే..
వివరాలకు సంప్రదించగలరు
హన్మకొండ: 9985411677, 9985411676,
వరంగల్: 9985406150, 9985408173
జనగామ: 9866431354, మహబూబాబాద్: 9985418040
తొర్రూరు: 9985408003 జయశంకర్: 9985401232



పార్టీ కండువాలను కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న యలమంచిలి వెంకటేశ్వరరావు

మూడోసారీ బీజేపీదే అధికారం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

గార్ల, మార్చి 18 : దేశంలో బీజేపీ నేతృత్వంలో రెండుసార్లు అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం.. తిరిగి మూడోసారి అధికారంలోకి రావడం తథ్యమని మహబూబాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు జోస్యం చెప్పారు. సోమవారం గార్ల మండలంలోని ముల్కనూరు కిష్టాపురం గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన 20 కుటుంబాలకు చెందిన 100 మంది కార్యకర్తలు వెంకటేశ్వరరావు సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగిందని, దీంతో తెలంగాణలో ఎక్కువ ఎంపీ సీట్లు గెలుచుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంపాల శ్రీను, నాయకులు అజ్మీరా రాము, ఆళ్ల శ్రీను, వీరియా నాయక్, భిక్షపతి, కిరణ్, దేవానాయక్, భూక్యా వెంకన్న పాల్గొన్నారు.



పురుగుల మందు తాగి

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



శాయంపేట, మార్చి 18: ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శాయంపేట మండలంలో జరిగింది. ఎస్ఐ ప్రమోద్ కుమార్ కథనం ప్రకారం.. రాజుపల్లి గ్రామానికి చెందిన ఆవుల దిలీప్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ టెలిగ్రామ్ యాప్‌కు సంబంధించిన ఫేక్ ట్రెండింగ్‌లో రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో విషయం తన తండ్రికి తెలుస్తుందనే భయంతో ఈనెల 3న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




మడికొండలో కేంద్ర పోలీసు బలగాల కవాతు



మడికొండలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య

మడికొండ, మార్చి 18: త్వరలో లోక్‌సభకు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి సోమవారం మడికొండలో స్థానిక ఇన్స్‌పెక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మెట్టుగుట్ట ప్రధాన ద్వారం వద్ద నుంచి గ్రామం ధర్మసాగర్ రోడ్డు చివర వరకు, అలాగే గ్రామంలోని ప్రధాన వీధులలో పోలీసు బలగాలు కవాతు చేశారు. ఈసందర్భంగా స్థానిక సీఐ ప్రతాప్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించనట్లయితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై రమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు జంపయ్య, మోహన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకట్, రామ్మూర్తి, అశోక్, రాజ్‌కుమార్, రాజు, సతీష్, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.



నమ్మించి వంచించాడు...

పోలీసులకు యువతి ఫిర్యాదు - కేసు నమోదు

హనుమకొండ టౌన్, మార్చి 18 : వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకొని పెళ్లి విషయం ప్రస్తావించగానే నాకు సంబంధం లేదంటూ యువకుడు తప్పించుకొని తిరుగుతున్నాడని ఓ యువతి సోమ వారం రాత్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన యువకుడు వివాహం చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి శారీకరంగా అనుభవించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపేర వుతు న్నాని 5 లక్షలను డిజిటల్ పేమెంట్ ద్వారా తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి తల్లి పెద్దమనుషుల ద్వారా వివాహం గురించి యువకుడి అడగగా పెళ్లికి ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయిం చా రు. పోలీసుల సమక్షంలో పెళ్లికి అంగీకరించి ఈ నెల 16న యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. మరుసటి రోజు నుంచి పెళ్లి ఇష్టం లేదు, పెళ్లి చేసుకోనని బెదిరిస్తుండడంతో యువతి ఫిర్యాదు మేరకు యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ.. ఆభరణాలు పట్టివేత



పట్టుబడిన ఆభరణాలను చూపిస్తున్నఎస్సై

ఐనవోలు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఐనవోలు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పున్నేలు క్రాస్‌రోడ్డు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయరహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. జనగాం జిల్లా జఫర్‌గడ్‌కు చెందిన గోల్డ్ స్మిత్ కందగట్ల శివప్రసాద్ రూ. 11.13 లక్షల విలువచేసే బంగారం, వెండి అభరణాలను తన కారులో తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. పత్రాలు లేని కారణంగా ఆభరణాలను స్వాధీనపరుచుకొని విచారణ కోసం ఇన్‌కాం టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్ క్రైం, మార్చి18 : వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ కాలనీలో మూడు బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.15 వేల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం లేబర్ కాలనీలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పి.రమేశ్, సంపత్, విద్యాసాగర్ ఇళ్లపై దాడి చేశారు. వారి నుంచి లిక్కర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధృవీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రవీందర్(ఫైల్)

ఆత్మకూరు, మార్చి 18: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన రవీందర్ (50) తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగా సోమవారం కూడా పనికి వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం ఇంటిలోని కరెంట్ బోర్డువద్ద ఉన్న వైర్లు రవీందర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీ, వివాహాలు అయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.










సాంకేతిక లోపంతో నిలిచిన ఇంటర్‌సిటీ

గార్ల, మార్చి 18 : సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లవల్సిన ఇంటర్ సిటీఎక్స్‌ప్రెస్‌రైలు సాంకేతిక లోపంతో గార్లలో 20 నిమిషాలు, డోర్నకల్‌లో 30 నిమిషాల పాటు అధికారులు నిలిపివేశారు. రైలు గార్ల సమీపంలోని పాకాలవంతెన వద్ద రైల్వే మరమ్మతుల పనులను నిర్వహిస్తున్న సిబ్బంది బండి వచ్చే సమయంలో ఉద్యోగులు ట్రాక్‌కు అమర్చిన జాకీవదిలి పక్కకు తప్పుకున్నారు. దీంతో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు పెద్దప్రమాదం తప్పింది. ఇంజన్ ముందు భాగం పూర్తిగా దెబ్బ తినడంతో బండిని సుమారు గంట పాటు నిలిపి వేశారు అనంతరం మరమ్మతులు చేపట్టి ముందుకు సాగించారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి స్థానిక యూనిట్ నెంబర్ 8 సంబంధించిన గ్యాంగ్ మోకర్‌దామ్ తమ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవరించారని ప్రాథమిక దర్యాప్తులో తేల్చి సదరు ఉద్యోగిని మహారాష్ట్ర బీదర్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

దంతాలపల్లి (మహబూబాబాద్ జిల్లా), మార్చి 18 : మండలంలోని రామానుజపురానికి చెందిన బయ్య ఉప్పలయ్య (55) తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. బయ్య ఉప్పలయ్యకు భార్యతో పాటు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 15న ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఈ క్రమంలో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా, సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







కేసముద్రం, మార్చి 18 : కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని రైల్వేశాఖ అమలు చేసిన 'ఇజ్జత్' పాస్‌ల కోసం నిరుపేద వర్గాలు ఎదురుచూస్తున్నాయి. రాయితీ పాస్‌లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ అల్పాదాయవర్గాలకు చెందిన దినసరి కూలీ పనులు చేసుకునేవారు, చిరువ్యాపారులు కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, డోర్నకల్, భద్రాచలం ప్రాంతాలకు రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్నారు. అల్పాదాయ వర్గాలను దృష్టిలో ఉంచుకొని, వారికి ఉపయోగపడేలా.. రూ.25లకే నెలరోజుల రైల్వే రాయితీ పాస్‌లను 'ఇజ్జత్' పేరుతో 2009లో అప్పటి కేంద్రప్రభుత్వం రైల్వేశాఖలో ఈ పథకాన్ని ప్రారంభించింది. నెలకు రూ.1500 అంతకంటే తక్కువ ఆదాయం ఉన్నవారు రూ.25లు చెల్లిస్తే, వంద కిలోమీటర్ల మేర నెల రోజులపాటు రైళ్లలో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించారు. ఈ పాస్‌లను పొందేందుకు ఆదాయ ధ్రువీకరణ బాధ్యతలను పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలకు ఇచ్చారు. ప్రజాప్రతినిధి ఇచ్చే ఆదాయ ధ్రువీకరణ లేఖను తీసుకువచ్చి రైల్వేస్టేషన్‌లో రూ.25లు చెల్లించి నెలరోజుల ప్రయాణం కల్పించే రాయితీ ఇజ్జత్ పాస్‌ను తీసుకునే అవకాశం ఉంటుంది. మూడు నెలలకొకసారి ఆదాయ ధృవీకరణ లేఖను తీసుకువచ్చి ఇజ్జత్ పాస్‌లను రెన్యువల్ చేసుకునే వారు.

అయితే ప్రజాప్రతినిధుల నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇష్టారీతిన తీసుకురావడంతో అధిక ఆదాయం ఉన్నవారు సైతం ఇజ్జత్ పాస్‌లను పొందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ రైలు సీజన్ టికెట్ల సంఖ్య తగ్గుతూ ఇజ్జత్ పాస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో రైల్వేశాఖ ఆ పాస్‌ల నిబంధనలను సవరించింది. 2013 అక్టోబర్ నెలలో ప్రజాప్రతినిధుల లేఖతో పాటు తహసీల్దార్ జారీచేసే ఆదాయ ధ్రువీకరణ పత్రం సైతం తప్పనిసరిగా జతచేయాలనే నిబంధన విధించింది. ఈ నిబంధనల ప్రకారం నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకురావాల్సి ఉంటుంది. ఆదాయ ప్రమాణాలు పెరిగిన పరిస్థితుల్లో రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణ ఇచ్చే నిబంధనలు రెవెన్యూశాఖలో లేవు. దీంతో ఇజ్జత్ పాస్‌ల జారీ క్రమంగా నిలిచిపోయింది. ఆ తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయి, బీజేపీ ప్రభుత్వం రావడంతో ఈ పథకాన్ని ప్రారంభించే విషయంలో గత పదేళ్లలో ఎలాంటి ప్రకటన చేయలేదు.

నిబంధనలు సవరిస్తేనే అమలు సాధ్యం..

'ఇజ్జత్' పాస్ జారీలో ఉన్న నిబంధనలు మారుతున్న ఆర్థిక పరిస్థితులకనుగునంగా సవరిస్తే అమలు సాధ్యమని తెలుస్తోంది. ఈ పాస్‌ల జారీకి రోజుకు రూ.50ల ఆదాయం ఉండే వారే అర్హులు. 15 ఏళ్లనాటి ఆదాయ ప్రమాణాలను ప్రస్తుత కాలానికి అనుగునంగా ఈ నిబంధనలు మార్చాల్సిన అవసరం ఉంది. కూరగాయలు విక్రయించే వారు, కూలీ పనులకు వెళ్లే వారికి కనీసం రోజుకు రూ.200 నుంచి రూ.500 వరకు ఆదా యం వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితిని నెలకు రూ.1500లను సవరించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని అల్పాదాయవర్గాలు కోరుతున్నాయి. ఇలా చేయడంవల్ల రూ.72 వేల నుంచి రూ.1.80 లక్షల ఆదాయం వరకు తహసీల్దార్ ద్వారా ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ఈ ధృవీకరణపత్రాల ఆధారంగా మళ్లీ ఇజ్జత్ పాస్‌లను రూ.25లకే జారీ చేస్తే తమకు రైలు ప్రయాణ ఖర్చులు మిగులుతాయని అప్‌డౌన్‌చేసే దినసరి కూలీలు, చిరువ్యాపారులు చెబుతున్నారు.

నిరీక్షణ

'ఇజ్జత్' పాస్‌ల పునరుద్ధరణ కోసం ఎదురుచూపులు

- రాయితీ రైల్వేపాస్‌లు లేక ఇబ్బందులు
- రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న పేదలు దినసరి కూలీలు, చిరువ్యాపారులు
- నిబంధనలు సవరించి, తిరిగి అమలు చేయాలని డిమాండ్



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న దినసరి కూలీలు, అల్పాదాయ వర్గాలు (ఫైల్)

సుమారు 500 మంది..

మహబూబాబాద్ జిల్లాలోని ఇంటికన్నె, కేసముద్రం, తాళ్లపూసపల్లి, మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల నుంచి నిత్యం సుమారు 500 మంది అప్‌అండ్‌డౌన్ చేసే కార్మికులు, అల్పాదాయ వర్గాలకు చెందిన వారున్నారు. వీరిలో కేసముద్రం నుంచి ఉదయం కాకతీయ, సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్లకు వందమంది వరకు భవన నిర్మాణ కార్మికులు, అల్పాదాయవర్గాలుండగా, వివిధ రకాల చిరువ్యాపారులు 100 నుంచి 150 మంది వరకు వెళుతున్నారు. మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్ల నుంచి ఖమ్మంకు 200లకుపైగా వరకు కూలీలు, చిరువ్యాపారులు ఉదయం పుష్‌పుల్ రైలుకు వెళుతున్నారు. వీరంతా ఇజ్జత్ పాస్‌లు పొందేందుకు అర్హులైన అల్పాదాయవర్గాలకు చెందినవారు కావడం గమనార్హం.

రాయితీ పాస్‌లను ఇవ్వాలి

ఆంగోత్ బాల, కాంగ్రెస్ నాయకుడు, కేసముద్రం స్టేషన్



దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలకు ఎంతో ఉపయోగపడే రాయితీ పాస్‌లను ఇవ్వాలి. నిత్యం అధిక చార్జీలతో అప్‌అండ్‌డౌన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇజ్జత్ పాస్‌లు ఎంతో ఉపయోగపడ్డాయి. మళ్లీ రాయితీ పాస్‌లను అందించాలి.

అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న పేదలు

అడప రాజు, దర్జీ, కేసముద్రం స్టేషన్



ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. ఆదాయం పెరిగినప్పటికీ ఖర్చులు కూడా అధికమయ్యాయి. ఇప్పటి పరిస్థితులకనుగునంగా ఇజ్జత్ పాస్‌ల నిబంధనలను మార్పు చేసి మళ్లీ పేదలకు రూ.25ల రాయితీ పాస్‌లను అందివ్వాలి.

శాస్త్రవేత్తల పరిశోధనలు తోడ్పాటును అందించాలి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు రైతుల సంక్షేమానికి తోడ్పాటు అందించే విధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం ములుగురోడ్‌లోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడారు. పంటల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని కోరారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక ఒరవడులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రైతుల సంక్షేమానికి పరిశోధన, విస్తరణ రంగాల్లో శాస్త్రవేత్తలు చేసే ప్రతీ కార్య క్రమానికి తన తోడ్పా టు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం పరిశోధన స్థానం ఏడీ డాక్టర్ రావుల ఉమా రెడ్డి 2022-23 సంవ త్సరంలో వరంగల్ ప్రాం తీయ పరిశోధన స్థానం లో జరిగిన పరిశోధన ఫలితాలను వివ రించారు. రాబోయే సీజన్లలో విడుదల చేయ బోయే సరికొత్త వంగడాల గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశో ధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామ్‌రెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, రాణాప్రతాప్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. మాలతి, టి. సుజాత, వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యసాయాధికారులు ఉషాదయాల్, రవీందర్‌సింగ్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. బలరామ్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, వివిధ జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి

లేదంటే యథావిధిగా సమ్మె

వరంగల్ మెడికల్, మార్చి 18 : మూడు నెలల వేతనాల కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీస్‌పై యూనియన్ ప్రతినిధులతో ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ సోమవారం చర్చలు జరిపారు. 20వ తేదీ వరకు జీతాలు చెల్లించాలని డైరెక్టర్ హామీ ఇచ్చారని జీతాలు చెల్లిస్తే సంతోషం.. లేకపోతే యథావిధిగా సమ్మె కొనసాగుతుందని ఏఐటీ యూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా, ఎన్‌హెచ్ఎం ఆల్ క్యాడర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న దాదాపు 17వేల మంది ఉద్యోగులకు మూడు నెలలుగా చెల్లించకుండా పెం డింగ్ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఈ నెల 22 నుం చి నిరవదిక సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ వేతనాలు చె ల్లించే విషయంలో కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఈ పోరాటానికి ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, రెండవ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాం జనేయులు, రెండవ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, కోశాధికారి పద్మ, జ్యోతి, రాజేశ్వరెడ్డి, బాపుయాదవ్‌తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా



స్టోన్ క్రషర్స్ యజమానుల సమ్మెబాట

- ఉపాధి కోల్పోతున్న వందల మంది కూలీలు
- సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ
- ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేయాలని యజమానుల డిమాండ్


క్రషర్‌లో నిలిచిన పనులు


నిలిచిన వాహనాలు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 18 : మైనింగ్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా తెలంగాణ స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టోన్ క్రషర్స్ యజమానులు ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. 25 సంవత్సరాలుగా క్రషర్స్ లీజుకు తీసుకుని నడుపుకుంటున్న మాపై అక్రమంగా ఫెనాల్టీలు వేస్తున్నారని యజమానులు అంటున్నారు. మేము ప్రతీ సంవత్సరం రాయల్టీ ఫీజు హెక్టార్‌కు రూ.లక్ష ప్రభుత్వానికి కడుతున్నామని, 80 శాతం కంకరను ప్రభుత్వ పనులకే సరఫరా చేస్తున్నామని, 80 శాతానికి కాంట్రాక్టర్ బిల్లు నుంచి సీనరేజి ఛార్జెస్ కట్ చేసి మైనింగ్ శాఖకు జమ చేస్తున్నామని యజయానులు వాపోతున్నారు.

సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ

రాయల్టీ(సీనరేజి) ఫీజు అనేది కాంట్రాక్టర్ దగ్గర గానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర గానీ ఎవరో ఒకరి దగ్గర మాత్రమే ప్రభుత్వం వసూలు చేయాలి. కానీ ప్రభుత్వ పనులకు సంబంధించిన సీనరేజి ఛార్జెస్ మైనింగ్ శాఖకు క్రషర్ యజమానులు చెల్లించాలి దాంతో మాకు సంబంధం లేదు అని అంటున్నారని యజమానులు సమ్మెకు దిగారు. అలాగే 30 సంవత్సరాల నుంచి ఉన్న లీజులను ఇప్పుడు ఆన్‌లైన్ విదానం ద్వారా సర్వే చేసి ఇప్పుడున్న రేటు ప్రకారం ఇష్టారాజ్యంగా ఫెనాల్టీ వేసినట్లయితే గతంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఏం చేసిందనేది క్రషర్ యజమానుల వాదన. ఇప్పుడు ఆన్‌లైన్ సర్వే చేసి కోట్ల రూపాయలు ఫెనాల్టీ వేస్తున్నారని, ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేస్తే ప్రభుత్వం ఎలా చెప్తే అలా నడుచుకుంటామని అంటున్నారు.

ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి..

పేరాల మధుసూదన్ రావు, కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి. రాయల్టీ ఫీజు కాంట్రాక్టర్ దగ్గర కానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర ఎవరో ఒకరి దగ్గర మాత్రమే తీసుకోవాలి. డిజిటల్ సర్వే చేసి రూ.కోట్లలో పెనాల్టీ విధించడం సరికాదు. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తాం.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా క్రషర్స్ నడుపుకోవాలి


సాంబశివరావు, మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టోన్ క్రషర్స్ యజమానులు క్రషర్స్‌ను నడుపుకోవాలి. ప్రభుత్వ, మైనింగ్ శాఖ నిబంధనల మేరకు నడుచుకోవాలి. క్రషర్స్ యజమానుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.

వెండి ఆభరణాలకూ హాల్ మార్క్ వేయాలి

బీఐఎస్ డీడీజీకు వినియోగదారుల మండలి విజ్ఞప్తి

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు చెన్నైలోని సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యుఎస్‌పీ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్, ఉపాధ్యక్షుడు మొగలిచెర్ల సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పిడతల రమేష్‌రెడ్డి, చైన్నై నగర అధ్యక్షుడు ఎకె.ప్రకాశ్‌లు చైన్నైలో యాదవ్‌తో సమావేశం అయ్యారు. వెండి ఆభరణాలలో 50 శాతం వరకు కల్తీ జరుగుతోందని, వెండిని ఎక్కువ శాతం కొనుగోలు చేసేది పేద, మధ్య తరగతి ప్రజలేనని వారు తెలిపారు. సాంప్రదాయంగా వెండిని ఎక్కువగా ధరించేది గిరిజనులేనని, దీంతో వెండిలో కల్తీ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేదవారు, గిరిజనులేనన్నారు. అందు వల్ల వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 41, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 హాల్ మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయనీ వీటి సంఖ్యను పెంచాలని కూడా వారు కోరారు. వినితి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు ఐఎస్‌ఐ డీడీపి యాదవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాల్లో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


వినతి పత్రం సమర్పిస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

రేపటి నుంచి కెమిస్ట్రీ మూల్యాంకనం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : ఇంటర్మీడియేట్ జవాబు పత్రాల మూల్యాంకనంలో భాగంగా ఈ నెల 20 నుంచి రసాయన శాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని క్యాంపు అధికారి ఎ. గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీతో పాటు ఫిజిక్స్ ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మూల్యాంకన విధుల్లో పాల్గొనాల్సిన అధ్యాపకులు 20న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ స్పాట్ క్యాంప్‌లో రిపోర్టు చేయాలని ఆయన కోరారు.

నేడు రైతులకు వీసీలో సలహాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : రైతు వేదికలో ఏర్పాటు చేసే వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు రైతు నేస్తం కార్యక్రమంలో నేరుగా రైతులు వీక్షించాలని ఆమె కోరారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయంలోని పలువురు శాస్త్రవేత్తలు రైతుల కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పంటల సాగు, సస్యరక్షణ అంశాలపై సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు.

నెల్లికుదురు పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ ఎప్పుడో?

- నెరవేరని ఉన్నతాధికారుల హామీలు
- 36 గ్రామపంచాయతీలకు ఒక్కటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- సేవలందక ఇబ్బంది పడుతున్న రోగులు
- ఉన్నతీకరించాలని ప్రజల విజ్ఞప్తి

నెల్లికుదురు, మార్చి 18 : రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పం నెరవేరడం లేదు. పేదలకు మంచి వైద్యం అందిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి, మెరుగైన వైద్యసేవలు అందిస్తామని వైద్యశాఖ అధికారులు పలుమార్లు చెప్పారు. అదనపు పీహెచ్‌పీ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. నేటికి ఏర్పాటు చేయకపోవడంతో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా తండావాసులు, గ్రామస్థులు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రావాలంటే 10 నుంచి 12 కిలో మీటర్ల దూరం నుంచి రావలసిన పరిస్థితి నెలకొంది. జ్వరపీడితులు, షుగర్, బీపీ, క్షయరోగులు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో వరంగల్ మహబూబాబాద్ ప్రాంతాలలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నూతనంగా పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే 10 గ్రామ పంచాయతీలకు 70 తండాలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

నెల్లికుదురు మండలంలో 36 గ్రామపంచాయతీలు, 110 శివారుతండాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 30 వేల


నెల్లికుదురులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ) అవసరం. మండలంలో 60 వేల జనాభా ఉంది. వాస్తవానికి రెండు పీహెచ్‌సీలు ఉండాలి. గ్రామాలకు తండాలకు వైద్యసేవలు అందించడానికి మండలంలోని చిన్నముప్పారం, ఆలేరు గ్రామాల పరిధిలో మరోనూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి, సేవలు అందించాల్సి ఉంది.

హామీలకే పరిమితం..

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించవలసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుచున్నారు. మండలకేంద్రంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన పీహెచ్‌సీలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి, నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనంలో గదులు ఇరుకుగా ఉండి మౌళిక సౌకర్యాలులేక పోవడంతో సిబ్బందితో పాటు రోగులు ఇబ్బంది పడుతున్నారు. పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తే మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలతో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఉంటుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

పీహెచ్‌సీలో కుటుంబ నియత్రణ ఆపరేషన్ చేయించుకున్నవారికి ప్రత్యేకమైన గదులు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. మడత మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకునే దుస్థితినెలకొంది. గతంలో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరడంతో రోగులకు గ్లూకోజ్‌లు ఎక్కించడానికి. విశ్రాంతి తీసుకోవడానికి గదులేక ఇబ్బంది పడుతున్నారు.

వైద్యసిబ్బంది కొరత..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ఉపకేంద్రాలలో 51 మంది వైద్యసిబ్బంది ఉండాలి. 28 మంది మాత్రమే ఉన్నారు. 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఇద్దరు వైద్యాధికారులు ఉన్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ వెద్యసేవలు అందిస్తున్నప్పటికి సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో రోగులకు వైద్యం అందడంలేదు. మండలంలో 12 హెల్త్ సబ్‌సెంటర్‌లు ఉన్నాయి వాటిలో 24 మంది ఏఎన్‌ఎంలు ఉండాలి కేవలం 15 మంది ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. 9 ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్, ఎల్‌డీ కంప్యూటర్, స్టాఫ్‌నర్స్‌లు, లేక పోవడంతో రక్తపరీక్షలు చేయలేక పోవుచున్నారు. దీంతో రోగ లక్షణాలను నిర్ధారించలేకపోతున్నారు. కేవలం రోగి బాహ్య లక్షణా లను చూసి మందులు ఇస్తున్నారు. ముఖ్యంగా వైద్యసేవలు అందించే పీహెచ్‌ఎన్, మేల్ సుపర్‌వైజర్, ఇద్దరు స్టాప్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రోగులకు వైద్యసేవలు అందించలేకపోతున్నారు. ఇప్పటికైనా వైద్యసిబ్బందిని నియమించి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గూడూరులో ఉపాధిహామీ సోషల్ ఆడిట్


ఐకేపీ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

గూడూరు, మార్చి 18 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీడీ శాంతకుమారి, జిల్లా అంబుడ్స్‌మెన్ బెస్త ఆదామ్, జిల్లా విజిలెన్స్ అధికారి మన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో వీరస్వామి, ఏపీవో బన్సీలాల్‌లు సోషల్ ఆడిట్ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల రిపోర్టును ఎస్ఆర్పీ, డీఆర్పీలు చదివి విన్పించారు. కొన్నిగ్రామాల్లో ఒకే కుటుంబానికి రెండు, మూడు జాబ్‌కార్డులు ఉన్నాయని, పనుల్లో నాణ్యత లోపం, మస్టర్‌లు రాయడంలో నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు సంబంధించి కొంతమంది పంచాయతీ కార్యదర్శులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతోఉపాధిహామీ పథకం తీసుకువచ్చారని, ఈపథకం ద్వారా గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పించడం జరుగుతుందన్నారు. గూడూరులో ఉపాధిహామీలో చేపట్టిన పనుల పట్ల అధికారులు సం తృప్తి వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఆర్పీలు మహేష్, రఘు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలి

- ట్రాన్స్‌కో డీఈ విజయ్

డోర్నకల్, మార్చి 18 : డోర్నకల్, కురవి, గార్ల సబ్‌డివిజన్ పరిధిలోని పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని ట్రాన్స్‌కో డీఈ విజయ్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి లబ్ధిదారులకు అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు సైతం అవసరమున్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మలు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌వైర్లు కిందకు వేలాడుతున్న చోట అదనంగా స్తంభాలను ఏర్పాటు చేసి సరిచేయాలన్నారు. ఏడీఈ రమేష్, ఏఈలు కిరణ్, మహేందర్, సబ్ ఇంజనీర్‌లు, లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

'క్షణిక సుఖాల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 18 : క్షణిక సుఖాల కోసం నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన హెచ్ఐవీ/ఎస్‌టీఐపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలన్నారు. హెచ్ఐవీ బారిన పడిన వారు నేరుగా ఐసీటీసీ కేంద్రాల్లో పరీక్షలు చేయించుకొని, మందులు వాడాలని సూచించారు. యువత లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధనకు కృషిచేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యారచన పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో బిందుశ్రీ, అధికారులు రమేష్, మాధవ్, మంగమ్మ, రవీందర్, వీరబాయి, అనిత, శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐదు లీటర్ల గుడుంబా పట్టివేత

డోర్నకల్, మార్చి 18 : వెన్నారం గ్రామపంచాయతీ శివారు రామకుంటతండాలో సోమవారం రాత్రి డోర్నకల్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రామకుంటతండాలో కొందరువ్యక్తులు గుడుంబా తయారు చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి, భారతి ఇంట్లో ఐదులీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు చెప్పారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఏఎస్సై కోటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



WANTED
★ హన్మకొండ వరలక్ష్మీ మొబైల్ షాపులో పని చేయుటకు సేల్స్ గర్ల్స్ మరియు టెలికాలర్స్ కావలెను. జీతం : 8000 - 10000. సం.ప్ర॥ 7013133592, 9182927673
AJW-177994

WANTED HOSPITAL STAFF
★ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు LAB టెక్నీషియన్స్ అనుభవంగలవారు కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్. 12 to 2 pm.
AJW-0361

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000 - 14,000/-. 8 గం॥, 12 గం॥ల డ్యూటీలు కలవు. సంప్ర॥ 8688072125
AJW-177989

WANTED
★ మా షాప్‌లో పనిచేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. Timings : 9.30 to 6 pm, జీతం : 6,500/- మరియు డెలివరీ బాయ్స్ కావలెను Timings : 12 pm to 10 pm, జీతం : 10,000 + అలవెన్స్. సంప్ర॥ 6309708800, 7093763375
AJW-177993

WANTED
★ శ్రీదేవి హాస్పిటల్‌లో పనిచేయుటకు Male & Female కంప్యూటర్ ఆపరేటర్లు, ఫార్మాసిస్ట్‌లు, GNM Sisters కావలెను. అడ్రస్ : M.S. రెడ్డి కాంప్లెక్స్ వెనుక, విజయ టాకీస్ దగ్గర, హన్మకొండ. Cont : 8185955888
AJW-3826

RENTAL FOR SCHOOL BUILDING
★ Station Ghanpur (Mdl), Shivunipally (Vill) లోని Aditya Model School Building Rental కు ఇవ్వబడును. ఆసక్తిగలవారు స్కూల్‌లో సంప్రదించగలరు. Cell : 9391180737, 8374650070, 8555909524
AJW-5852

TO-LET
★ REC పెట్రోల్ పంప్ (తారాగార్డెన్ ఎదురుగా) మెయిన్ రోడ్‌లో 1780 చ॥అ॥ విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 3000 చ॥అ॥ విస్తీర్ణంలో గల వర్క్‌షాప్ పూర్తి టూరేజ్ షెడ్‌తో టూవీలర్స్, ఫోర్‌వీలర్స్ షోరూంలకు, వ్యాపార సంస్థలకు కిరాయికి ఇవ్వబడును. సం.ప్ర.॥ 9704445770, 8897678810
AJW-159726

HOUSE FOR SALE
★ ఉర్సు గుట్ట నుండి కాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్ ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సంప్ర॥ 7660008666, 8309035091
AJW-27486

PLOTS FOR SALE
★ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో అమ్మబడును. కేవలం 15,000/-లకు గజం మాత్రమే. సంప్ర॥ 9849992488
AJW-5857

KUDA PLOT FOR SALE
★ Oglapur Main Road అతి దగ్గరలో 100 ఫీట్ల రోడ్డు, 40 ఫీట్ల రోడ్ గల KUDA Plots కలవు. ధర 7,500/- నుండి 8,999/- వరకు. సంప్ర॥ సిరి - 6301613156
AJW-177991

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సంప్ర॥ 7660008666, 8309035091
AJW-27482

HOUSE FOR SALE
★ ములుగు రోడ్ కాకతీయ కెనాల్ కన్నా ముందుగణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న Independent House అమ్మకానికి కలదు. సెల్ : 7660008666, 8309035091
AJW-27484

PLOT FOR SALE
★ మడికొండ, రాంపూర్ దగ్గర 106 చ॥గ॥ల West Face గల ప్లాటు కేవలం రూ॥ 6 లక్షలకే అమ్మబడును. సంప్ర॥ 9573689941
AJW-159728

HOUSE FOR SALE
★ కేవలం రూ॥ 26 లక్షలకే డబుల్ బెడ్‌రూం హౌస్ విత్ ఫర్నీచర్‌తో EMI పద్ధతిలో అమ్మబడును. సంప్ర॥ 9573689941
AJW-159728

లోన్స్ ఇప్పించబడును.
★ వ్యాపార ఋణాలు (MSME) గృహ ఋణాలు, గృహ తనఖా ఋణాలు (NRI) (Commercial) నేషనల్ బ్యాంకుల ద్వారా మరియు ప్రైవేట్ బ్యాంకుల ద్వారా అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సెల్ : 73823 33366, 97043 40702
AJK-185638

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు : సీపీఎం


వైవీ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, మార్చి 18 : ప్రజాసమస్యల పరిష్కారం కోసం తన గొంతులో ప్రాణమున్నంత వరకు ఉద్యమించిన పోరాటయోధుడు వై.వెంకటయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కొనియడారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం దివంగత పార్టీ జిల్లా నాయకుడు వై.వెంకటయ్య ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన జీవితకాలం నిరుపేదలు, కూలీలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కోసం పోరాటాలు సాగించిన వెంకటయ్య ఆశయసాధనకుపాటు పడాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ పేదలమధ్య ఐక్యతను దెబ్బ తీస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో పదేళ్ల దేశం అధోగతి పాలైందన్నారు. రాబోయే కాలంలో ఎర్రజెండా ద్వారా పేదలు, కూలీలు, రైతాంగం కోసం పోరాటాలు నిర్వహించి వెంకటయ్య చూపిన మార్గంలో ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, కుర్ర మహేష్, కుంట ఉపేందర్, రాంమూర్తి, శ్రీనివాస్, నాగన్న, రాజు, వెంకన్న, భాగ్యమ్మ, రమాదేవి, లక్ష్మణ్, వెంకన్న, ప్రకాశ్ పాల్గొన్నారు.

లంబాడీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ భీమానాయక్

నెహ్రూసెంటర్, మార్చి 18 : ఎన్నికల ముందు లంబాడీలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ గుగులోతు భీమానాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 40 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు కోసం లంబాడీలు కృషి చేశారని వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి మోసం చేసిందని ఆరోపించారు. మంత్రివర్గంలో ఇప్పటి వరకు లంబాడీలను తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.37 కార్పొరేషన్ పదవుల్లో 17 రెడ్డి సామాజికవర్గానికి కట్టబెట్టారని, లంబాడీలకు ఒకటే కార్పొరేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బానోత్ రాందాస్‌నాయక్, మంగీలాల్‌నాయక్, వాంకుడోతు మంగీలాల్, గుగులోతు గాంధీనాయక్, శివవర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుగులోతు భీమానాయక్

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 18 : హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వ, సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్ అలీలను సోమవారం తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన బెల్లయ్యనాయక్ పలువురు కాంగ్రెస్ నేతలను కలుసుకున్నారు. వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని కలిసి పుష్పగుచ్ఛాలందించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'కాంగ్రెస్‌లో చేరికలు ఉండవు'

గూడూరు, మార్చి 18 : తమకు తెలియకుండా ప్రతిపక్ష పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు ఉండవని మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరులో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రిం వీరస్వామి, బొల్లికొండ మధు, శ్రీపాల్‌రెడ్డి, యాకయ్య, రసూల్, సురేష్, వీరస్వామి, రవిసింగ్, ఉపేందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

భూపతిపేటలో వాహనాల తనిఖీ

గూడూరు, మార్చి 18 : భూపతిపేట వద్ద కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ ఆదేశాల మేరకు గూడూరు పోలీసులు సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వాహనాల తనిఖీ ప్రక్రియలో భాగంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు సీఐ బాబురావు, ఎస్సై నగేష్, తహసీల్దార్ శ్వేత తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

'అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి'

తొర్రూరు రూరల్, మార్చి 18 : సమసమాజ నిర్మాణం కోసం పోరాడి అమరులైన ఆమరుల ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్వాల వీరయ్య, జడ్పీ ఫ్లోర్ లీడర్, తొర్రూరు జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సీపీఎం సీనియర్ నాయకుడు యనమాల వెంకటయ్య ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని గోపాలగిరి గ్రామంలో ఆయన స్థూపం జెండా ఆవిష్కరించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివక్షతలేని సమసమాజ స్థాపన కోసం పేద, బడుగు, బలహీనవర్గాల సమస్యల కోసం అనునిత్యం పోరాడిన నాయకుడు వైవీ అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, గునిగంటి మోహన్, పెరుమాండ్ల తిలక్‌బాబు, బాణాల రాజన్న, కంఠాయపాలెం ఉప సర్పంచ్ గజ్జి రాంమూర్తి, రాంమూర్తి, వల్లపు మల్లయ్య, పసులాది వెంకన్న, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అద్భుతాలు : ప్రిన్సిపాల్ వేణుగోపాల్

మరిపెడ, మార్చి 18 : సైన్స్‌తోనే అనేక అద్భుతాలు సృష్టించొచ్చని మరిపెడ ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఆ కళాశాలకు హైదరాబాద్‌కు చెందిన మొబైల్ ఎగ్జిబిషన్ వాహనం రాగా, సైన్స్‌కు చెందిన పలు ఎగ్జిబిట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ విద్యార్థులకు వివరించారు. డీఎన్ఏ, ఆర్ఎన్ఏ, ప్రోటీన్ల సమాచారాన్ని విద్యార్థులు తెలుసుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాపాడాలి

మరిపెడ, మార్చి 18 : భవన నిర్మాణ కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు అన్నారు. సోమవారం మరిపెడలోని కనకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో రాములు మాట్లాడారు. కార్మిక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, కార్మికులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం బాధ్యులు కొండ ఉప్పలయ్య, బండ వీరస్వామి, భూషిపాక ముత్తయ్య, యాదగిరి, ఎల్లయ్య, భిక్షం, శ్రీనివాస్, వెంకన్న, సెదులు, పాపయ్య, రాములు, ఇస్తారి పాల్గొన్నారు.

'ప్రభుత్వాధికారులపై దాడులు చేయడం సరికాదు'

తొర్రూరు, మార్చి 18 : ప్రభుత్వాధికారులపై దాడులు చేయడం సరికాదని తొర్రూరు ఎంపీడీవో ఎస్ కే.సిలార్ సాహెబ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిషత్ అధ్యక్షురాలు ఎంపీవోపై దాడి చేయడం సరికాదని, దీనికి నిరసనగా సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ వచ్చినందున పాత డేట్‌లు వేసి అభివృద్ధి పనులను మంజూరు చేయాలని ఒత్తిడి చేస్తే ఎంపీవో నిరాకరించడంతో దాడి చేశారని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గౌస్, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డోర్నకల్ మండలంలో రెండు చెక్‌పోస్టుల ఏర్పాటు


ముల్కలపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

డోర్నకల్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద, మండలంలోని ముల్కలపల్లి మహబూబాబాద్-కోదాడ 365/ఎ జాతీయ రహదారి వద్ద మరో చెక్‌పోస్టును సోమవారం రెవెన్యూ పోలీస్ అధికారులు ఏర్పాటు చేశారు.త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి, సీఐ ఉపేందర్‌రావులు తెలిపారు. రూ.50 వేలకుమించి నగదును తీసుకువెళ్లే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాలని చెప్పారు. సరైన పత్రాలు లేని నగదును సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

కోమట్లగూడెంలో గుండెపోటుతో వ్యక్తి మృతి

గంగారం, మార్చి 18 : మండలంలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన జనగం నారాయణ (52) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఉదయం ఇంటినుంచి బయటికి వచ్చిన నారాయణకు గుండె నెప్పి వచ్చి రోడ్డుపై పడిపోయాడని స్థానికులు తెలిపారు. పడిపోయిన నారాయణను స్థానిక వైద్య శాలకు తీసుకువెళ్లే క్రమంలో ఆయన ప్రాణం పోయిందని గ్రామస్థులు తెలిపారు.

'రజకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నెల్లికుదురు, మార్చి 18 : రజకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రజకసంఘం మండల అధ్యక్షుడు వరిపెల్లి ఉప్పలయ్య తెలిపారు. స్థానిక విశ్రాంతి భవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రజకులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ పదవుల్లో రజకులకు స్థానం కల్పించాలన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యికోట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వరిపెల్లి వెంకన్న, రత్నపురం యాకయ్య, వెంకన్న, వీరభద్రం, పూర్ణచందర్, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మాలోతు మాన్‌సింగ్ (ఫైల్)

గూడూరు, మార్చి 18 : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలకేంద్రం శివారు తాళ్లతండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు శివారు చంద్రుగూడెంకుచెందిన మాలోతు మాన్‌సింగ్ (55)కు తాళ్లతండాలో మూడెకరాల పొలం, ఎకరం చెలక ఉంది. అందులో వరి, మొక్కజొన్న పంటను సాగు చేశాడు. సోమవారం పొలానికి నీరుపెట్టేందుకు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. అక్కడ మోటారును ఆన్ చేయగా నీరు రాకపోవడంతో బావిలో దికి మోటారు పైపులో నీరుపోసే క్రమంలో విద్యుదాఘాతంకు గురై బావిలో పడ్డాడు. బావిలో పడిన శబ్దం విన్న పక్క పొలంలో పనిచేస్తున్న మాన్‌సింగ్ సోదరుడు లాల్‌సింగ్ చూసి అయనును బయటకు తీశాడు. వెంటనే చికిత్స నిమిత్తం గూడూరు సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలిస్తుండగా మాన్‌సింగ్ మృతి చెందాడు. మృతుడికి భార్య కౌసల్య, కుమారులు వేణుగోపాల్, రామకృష్ణ, కుమార్తె అనిత ఉన్నారు. మృతుడి సోదరుడు రాజారాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

చెన్నారావుపేట (వరంగల్ జిల్లా), మార్చి 18 : మండలంలోని చెరువుకొమ్ముతండా శివారు కోర్రతండాకు చెందిన ఓ వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందనట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఇదే తండాకు చెందిన భూక్య ఝాన్సీ (22)ని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిరుమలగండికి చెందిన ఓ యువకునికి ఇచ్చి వివాహం చేశారు. గత కొద్ది కాలంగా ఝాన్సీ కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఈనెల 11న పుట్టింటికి వచ్చిన ఝాన్సీకి కడుపు నొప్పి తీవ్రత ఎక్కువగా కావటంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పండింది. దీంతో చుట్టు పక్కల వారు గమనించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, మృతురాలి తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ వివరించారు.


నిజాంచెరువు వద్ద ఆమరణ నిరాహార దీక్షకు దిగిన తెలంగాణ ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్

షాదిఖాన నిర్మాణానికి అనుమతివ్వాలని ఆమరణ నిరాహార దీక్ష

మహబూబాబాద్ టౌన్, మార్చి18 : జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు పక్కన 669 సర్వేనెంబరులో ముస్లింల పట్టా భూమిలో షాదిఖానానిర్మాణానికి ఎన్‌వోసీ ఇవ్వాలని డిమాండ్‌తో సోమవారం నిజాం చెరువు వద్ద తెలంగాణ ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ ఆమరణ దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాదిఖాన నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు ఎన్‌వోసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దుల పేరుతో తమ భూములోకి వస్తున్నారని వాపోయారు. గతంలో అనేకమార్లు ఆందోళనలు చేపట్టి ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేసినప్పటికి ఫలితం లేకపోవడంతో ఆమరణ దీక్షకు పూనుకున్నట్లు వివరించారు. ఈ విషయం తెలుసుకున్న టౌన్ సీఐ దేవేందర్ చెరువు వద్దకు చేరుకుని అహ్మద్‌ఖాన్‌తో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో అహ్మద్‌ఖాన్ ఆమరణ నిరాహార దీక్ష విరమించారు.

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య


చంద్రయ్య (ఫైల్)

కేసముద్రం, మార్చి 18 : మండలంలోని ఇంటికన్నెలో సోమవారం అనారోగ్య సమస్యలతో అమరాజు చంద్రయ్య (63) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. చంద్రయ్య నాలుగేళ్లుగా పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు రాంమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య ఆగమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడికి పితృయోగం

- నేత్రాలను సేకరించిన లయన్స్‌క్లబ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 18 : పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ తండ్రి సత్యనారాయణ (88) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మహబూబాబాద్‌లో నివాసముంటున్నసత్యనారాయణ గుండెపోటుతో తన స్వగృహంలో కన్నుమూశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. సత్యనారాయణ మృతివార్త తెలుసుకున్న మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, కౌన్సిలర్లు నిమ్మలశ్రీను, భూక్యశ్రీను, జడ్పీసీఈవో రమాదేవి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ ,రాష్ట్రనాయకులుమురళీధరస్వామి, హల్యానాయక్, మిర్యాల సతీష్‌రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, పలితశ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్‌గఫార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహారావు మానుకోటలో సంకా సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి, నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాగా, లయన్స్ క్లబ్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల అనుమతితో సత్యనారాయణ నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐఇన్స్టిట్యూట్‌కు పంపించారు. ప్రతీ ఒక్కరు నేత్రదానం చేయడం వల్ల ఇరువురు అంధులకు చూపు ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ ప్రసాద్, మాలె కాళీనాథ్, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సంకా సత్యనారాయణ నేత్రాలను సేకరిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు